ప్రజాజ్యోతి
నిజామాబాద్
కామారెడ్డి
ఆదివారం। 27। జూలై। 2025 పేజీలు 5



## కుక్క దాడిలో ఎనిమిది మందికి గాయాలు



# కాటేవాడి వాగులో చిక్కుకున్న 30 మంది



### దాన్ని దాటుతుండగా ఒక్కసారిగా పెరిగిన ప్రవాహం
### 3 గంటల పాటు వరదలోనే నిరీక్షణ
### ఉధృతి తగ్గిన తర్వాత బయటికి రాక
### నాటు వేసి తిరిగొస్తుండగా ఘటన

గాంధారి, జులై 26 (ప్రజాజ్యోతి) భారీ వర్షాల కారణంగా గాంధారి మండలంలోని పలు గ్రామాల్లో వాగులు, వంకలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. గాంధారి మండలంలోని పొతంగల్ కుర్దు - నాగ్లూర్ శివారులోని పొలాలకు సుమారు 30 మంది రైతులు వరి నాట్లు వేయడానికి వెళ్లారు. పనులు ముగించుకుని సాయంత్రం తమ ఇళ్లకు తిరిగి వెళ్లేందుకు వారు ఆ ప్రాంతంలోని కాటేవాడి వాగును దాటుతుండగా, వరద ఉధృతి ఒక్కసారిగా పెరిగింది. దీంతో వారంతా వరదలో చిక్కుకుపోయారు. దాదాపు మూడు గంటల పాటు వరదలోనే నిరీక్షించారు. వరద తగ్గుముఖం పట్టిన తర్వాత వారంతా గుంపుగా వాగును దాటి సురక్షితంగా బయటపడ్డారు.

# నిజాంసాగర్ ప్రాజెక్టుకు వరద



నిజాంసాగర్ ప్రజా జ్యోతి జూలై 26 జిల్లాలో రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురవడంతో నిజాంసాగర్ ప్రాజెక్టుకి వరద తాకిడి కొనసాగుతుంది. నిజాంసాగర్ ప్రాజెక్టు ఎక్కువ ప్రాంతాల నుంచి 1625 క్యూసెక్కుల ఇన్ ఫ్లో వచ్చి చేరుతున్నట్లు ప్రాజెక్టు ఏఈఈ సాకేత్ తెలిపారు. ప్రాజెక్టులో 17.802 టిఎంసిలకు గాను.. ప్రస్తుతం ప్రాజెక్టులో 4.321 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్లు ఆయన చెప్పారు. నిజాంసాగర్ ప్రాజెక్టుకు ప్రధాన కాలువకు అనుసంధానంగా నిర్మించిన కళ్యాణి ప్రాజెక్టులోకి 640 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోంది.640 క్యూసెక్కుల ఇన్ ఫ్లో వచ్చిన మొత్తాన్ని వచ్చినట్టుగా ప్రాజెక్టు రెండు గేట్లు ఎత్తి దిగువనకు విడుదల చేస్తున్నట్లు తెలిపారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 409.59 మీటర్లు కాగా.. ప్రస్తుతం ప్రాజెక్టులో 407.00 మీటర్ల నీటి నిల్వ ఉన్నట్లు అధికారులు పేర్కొన్నారు.

# రక్తదాన శిబిరాన్ని ప్రారంభించిన కలెక్టర్

కామారెడ్డి ప్రతినిధి జూలై 26 (ప్రజాజ్యోతి) జిల్లా కలెక్టరేట్ ప్రాంగణంలో శనివారం ఉదయం 11 గంటలకు ఎస్సీ, ఎస్టీ, బీసీ మరియు మైనారిటీ సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ (ఐ ఆర్ సి ఎస్ ) సహకారంతో రక్తదాన శిబిరం ఘనంగా నిర్వహించబడింది. ఈ శిబిరాన్ని జిల్లా కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, "గత సంవత్సరం కామారెడ్డి జిల్లా రక్తదాన రంగంలో రాష్ట్రస్థాయిలో మంచి గుర్తింపు పొందింది.ఈ ఏడాది కూడా పేద మరియు అవసరమైన వారికి అత్యవసర సమయంలో రక్తాన్ని అందించేందుకు శాఖల మధ్య సమన్వయంతో మరింత బలోపేతంగా ఈ కార్యక్రమాలు జరగాలి," అని తెలిపారు. రక్తదాన శిబిరాన్ని పురస్కరించుకుని, గవర్నర్ అవార్డు పొందిన ఎస్సీ, ఎస్టీ, బీసీ మరియు మైనారిటీ శాఖల అధికారులను సన్మానించి,మమెంటోలు అందజేశారు. కలెక్టర్ ఈ సందర్భంగా రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ ఎం. రాజన్న ని ప్రత్యేకంగా అభినందించారు. ప్రతి నెల రెండు లేదా మూడు రక్తదాన శిబిరాలు నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని, ప్రభుత్వ శాఖలు ముందుకొచ్చి సహకరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా




అదనపు కలెక్టర్ రెవిన్యూ విక్టర్, జిల్లా అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ చందర్, ఎస్సీ కార్పొరేషన్ అధికారి దయానంద్, గ్రౌండ్ వాటర్ శాఖ సతీష్ యాదవ్,బీసీ వెల్ఫేర్ అధికారి షకీల్, చక్రధర్, డీఎస్సీ ఓ. వెంకటేష్,ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ (ఐ ఆర్ సి ఎస్) జిల్లా చైర్మన్ ఎం.రాజన్న,కార్యదర్శి బి.రఘు కుమార్,కరస్పాండెంట్ డాక్టర్ పీ వి నరసింహం,డిసిఓ శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

## కౌశిక్ రెడ్డి వ్యాఖ్యలపై ఆగ్రహం



రాజంపేట, జూలై 26 (ప్రజా జ్యోతి) తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారిపై బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలను జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్ది చంద్రకాంత్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. శనివారం రాజంపేట మండల పరిధిలోని పొందుర్తి గ్రామంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన స్పందించారు. కౌశిక్ రెడ్డి వ్యాఖ్యలు అసభ్యంగా ఉండటమే కాక, ప్రజాస్వామ్యాన్ని కించపరచేలా ఉన్నాయని మండిపడ్డ చంద్రకాంత్ రెడ్డి, ఒక ప్రజాప్రతినిధి బాధ్యతాయుతంగా మాట్లాడాలి. ముఖ్యమంత్రి గారిపై ఇలాంటి వ్యాఖ్యలు చేస్తే చూస్తూ ఊరుకోం. 24 గంటల్లో వ్యాఖ్యలను వెనక్కి తీసుకోకపోతే తీవ్ర పరిణామాలు ఎదురవుతాయి, అని ఘాటు హెచ్చరిక జారీ చేశారు. ప్రజా ఓటుతో ఎన్నికై వచ్చిన ముఖ్యమంత్రి పట్ల గౌరవం కలిగిఉండటం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు యాదవ రెడ్డి, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు కృష్ణారావు, అంకం రాజు పాటిల్, పొందుర్తి సర్పంచ్ గంగా కిషన్, టౌన్ కాంగ్రెస్ అధ్యక్షుడు బాబు, ఎంపిటీసీ బాల్ రాజ్ గౌడ్, పంబల బాలరాజ్, నందప్ప, సిద్ధ గౌడ్ రాజు తదితరులు పాల్గొన్నారు.

## నేడు లంబాడా హక్కుల పోరాట సమితి సమావేశం



గాంధారి జులై 27(ప్రజాజ్యోతి) గాంధారి మండల కేంద్రంలోని మారుతి ఫంక్షన్ హాల్‌లో నేడు, ఆధ్వర్యంలో ఒక భారీ సమావేశం జరగనుంది. ఈ సమావేశానికి లంబాడా హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు బేల్యా నాయక్ నాయకత్వం వహిస్తారు. రాష్ట్ర కాయతి లాబానా అధ్యక్షుడు బస్సి తాన్ సింగ్ నాయక్ ఆదేశాల మేరకు, గిరిజన జిల్లా అధ్యక్షుడు ప్రేమ్ సింగ్ మరియు గాంధారి మండల అధ్యక్షుడు పరుశురాం నాయక్ సభాధ్యక్షత వహిస్తారు. మన గిరిజన సంక్షేమ శాఖ మంత్రి శ్రీమతి సీతక్క,డిప్యూటీ స్పీకర్ రాంచంద్రు నాయక్. స్థానిక ఎమ్మెల్యే మాదన్ మోహన్.ఉమ్మడి నిజామాబాద్ జిల్లా ప్రజా ప్రతినిధులు. గిరిజన లంబడా మరియు కాయతి లాబానా సోదరుల సమస్యలను పరిష్కరించడమే ఈ సమావేశం యొక్క ప్రధాన లక్ష్యం అని వారు తెలిపారు. హాజరైన వారందరూ తమ సమస్యలను వినిపించాలని కోరారు. పోడు భూమి పట్టాలు,ఇంకా పట్టాలు రాని వారు. గిరివికాస్ మరియు పోడు పట్టాలు పొందిన వారు. రుణాల కోసం మరియు ఇతర సహాయం కోసం.మన ఎస్టీ కార్పొరేషన్ బిల్లు గురించి.సమావేశంలో పాల్గొనండి తమ హక్కులను కాపాడుకోవడానికి ఐక్యంగా ఉండటం యొక్క ప్రాముఖ్యతను నిర్వాహకులు వారు చెప్పారు. జిల్లా లాబానా అధ్యక్షుడు బంతి లాల్ మరియు గాంధారి మండల లాబానా యూత్ అధ్యక్షుడు బస్సి నర్సింగ్ మాట్లాడుతూ, ప్రతి గిరిజన లంబడా, లాబానా నాయక్, కారోబార్, డావ్ మరియు యువకులు పార్టీతో సంబంధం లేకుండా ఈ ముఖ్యమైన సమావేశంలో పాల్గొనాలని కోరారు. హాజరైన వారందరికీ భోజన సదుపాయాలు ఏర్పాటు చేయబడ్డాయి అని తెలిపారు.

## నూతన ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు



సదాశివనగర్ జూలై 26 (ప్రజాజ్యోతి) సదాశివనగర్ మండలంలోని మోడేగా%శీ% గ్రామంలో 25 కేవి ట్రాన్స్ఫార్మర్ తో తరచూ విద్యుత్ సమస్య ఏర్పడుతుండేది. గ్రామస్తులు సమస్యను విద్యుత్ అధికారులకు తెలిపారు. వెంటనే స్పందించిన అధికారులు కొత్త ట్రాన్స్ఫార్మర్ను బిగించారు. సమస్యను తీర్చినందుకు విద్యుత్ అధికారులకు గ్రామస్తులు ధన్యవాదాలు తెలిపారు




## కౌశిక్ రెడ్డి పై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు

బీబీపెట్ మండల్ ప్రజా జ్యోతి జూలై 26 తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పై టిఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యల పట్ల బిబిపేట్ మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. రాస్తారోకో నిర్వహించడంతో ఇరువైపులా వాహనాలు నిలిచిపోయాయి. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సుతారి రమేష్ మాట్లాడుతూ మరొకసారి పాడి కౌశిక్ రెడ్డి ఇలాంటి ఘటనలకు పాల్పడితే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. అనంతరం పాడి కౌశిక్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. అక్కడి నుండి ర్యాలీగా పోలీస్ స్టేషన్ కు వెళ్లి ఎస్ఐ ప్రభాకర్ కు పాడి కౌశిక్ రెడ్డి పై కఠిన చర్యలు తీసుకోవాల్సిందిగా ఫిర్యాదు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి భూమా గౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్ పాత రాజు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ తోట రమేష్, సలీం,యూత్ అధ్యక్షుడు మహేష్, అరుణ్,అంకన్నగారి శ్రీనివాస్ గౌడ్, రాకేష్ రెడ్డి, మ్యాదరి స్వామి, అంకన్న గారి నాగరాజు గౌడ్,ఎంబరి వెంకటేష్, మీసాల సత్తయ్య లతోపాటు మండలంలోని వివిధ గ్రామాల కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

సదాశివనగర్ జులై 26 (ప్రజాజ్యోతి) భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచించారు. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు వాగులు,వంకలు పొంగిపొర్లుతున్నాయి. మండలంలోని ప్రమాదకర ప్రాంతాలను సదాశివనగర్ సిఐ సంతోష్ కుమార్, ఎస్సై పుష్పరాజ్ పరిశీలించారు. వాగులు, కల్వర్టుల దగ్గర సెల్ఫీలు తీయడాలుగాని చేపలు పట్టడానికి వెళ్లరాదని హెచ్చరించారు. ఇటువంటి ప్రదేశాలకు వెళ్లడం వల్ల ప్రమాదవశాత్తు ప్రాణ నష్టం జరిగే అవకాశం ఉంది. పాత ఇళ్లలో నివసిస్తున్న వారు పోలీసులకు లేదా గ్రామ పంచాయతీకి సమాచారం ఇవ్వాలి. అవసరమైతే తాత్కాలిక నివాసానికి తరలించుకోవాలి. ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని ప్రమాదాలు జరిగితే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. అత్యవసర పరిస్థితుల్లో 100 నెంబర్ కు కాల్ చేయాలని, పోలీస్ సిబ్బంది మీ సేవలో అందుబాటులో ఉంటారని అన్నారు.




## ఘనంగా వనమహోత్సవం

**ముఖ్యఅతిథిగా ఎఫ్‌డిఓ సునీత**



గాంధారి, జూలై 27(ప్రజాజ్యోతి) గాంధారి మండలంలోని పొతంగల్ సెక్షన్ పరిధిలోని రాంపూర్ గడ్డ బీట్‌లో శనివారం వన మహోత్సవం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బాన్సువాడ ఫారెస్ట్ డివిజన్ ఆఫీసర్ సునీత ముఖ్యఅతిథిగా హాజరయ్యారని ఎఫ్.ఆర్.ఓ. హేమచందన వెల్లడించారు.తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వన మహోత్సవంలో భాగంగా సునీత మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, "వానలో వనం, వనంలో మనం" అనే నినాదంతో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పచ్చదనం పెంపే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్సై ఆంజనేయులు కూడా పాల్గొని మొక్కలు నాటారు. డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ మొజ్జం అలీ ఖాన్, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్లు సునీత, సుల్తానా, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ జోయల్తో పాటు ఇతర ఫారెస్ట్ సిబ్బంది ఈ వన మహోత్సవంలో పాల్గొన్నారు.

## మహిళా డిగ్రీ కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు




సదాశివనగర్ జూలై 26 (ప్రజాజ్యోతి) తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాల కామారెడ్డి (మర్కల్) నందు ఎస్.సి కేటగిరీ లో ఖాళీగా ఉన్న సీట్ల కోసం విద్యార్థులకు డిగ్రీ స్పాట్ అడ్మిషన్లు జరుగుచున్నవి. కావున ఇంటర్మీడియట్ పూర్తయిన విద్యార్థులు నేరుగా కళాశాలకు వచ్చి అడ్మిషన్ పొందవలసిందిగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సి. శోభారాణి తెలిపారు. ఈ ప్రత్యేక విడత దోస్త్ రిజిస్ట్రేషన్ జులై 25 నుండి 31 తేదీ వరకు కొనసాగనుంది. సీటు కొరకు ఒరిజినల్ సర్టిఫికేట్లతో కళాశాలలో వెంటనే సంప్రదించాలని అన్నారు .

## ఆర్థిక సహాయం అందజేత

కామారెడ్డి టౌన్ ప్రజా జ్యోతి న్యూస్ జూలై 27: కామారెడ్డి జిల్లా పాల్వంచ మండలం భవానిపేట గ్రామానికి చెందిన గంగని స్వామి చిన్న కూతురు ఆరోగ్యం బాగ లేక హైద్రాబాద్ లోని నీల ఫర్ హాస్పిటల్ లో చికిత్స పొందుతుంది ఈ విషయం తెలుసుకుని కామారెడ్డి జిల్లా మాదిగ సేవా సమతి తరపున గంగని శ్రీనివాస్ గారి ఆధ్యర్యంలో వారి కుటుంబ సభ్యులకు 12000/- ఆర్థికసహాయం అంద చేయడం జరిగింది.



## డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల పరిసర ప్రాంతాల పరిశీలన



కామారెడ్డి ప్రతినిధి జూలై 26.(ప్రజాజ్యోతి) కామారెడ్డి పట్టణం 22 వ వార్డు పరిధిలో గల డబల్ బెడ్ రూమ్ ఇళ్ల పరిసర ప్రాంతాలను పరిశీలించిన కామారెడ్డి శాసన సభ్యులు కాటిపల్లి వెంకట రమణ రెడ్డి. అక్కడ నెలకొన్న సమస్యలు డ్రైనేజీ, త్రాగు నీరు, రోడ్డు, పారిశుధ్యం వంటి సమస్యలు ఉన్నట్లు శాసన సభ్యుని దృష్టికి తీసుకు వచ్చిన కాలని వాసులు. అధికారులతో మాట్లాడి సాధ్యమైనంత తొందరగా పరిష్కారం చేస్తానని ఎమ్మెల్యే కాలని వాసులకి తెలపడం జరిగింది.

## "చలో కామారెడ్డి" ని విజయవంతం చేయండి



గాంధారి, జూలై 27 (ప్రజాజ్యోతి) కామారెడ్డి జిల్లా అధ్యక్షులు గంగారం ఆదేశాల మేరకు, మత్స్యకార కార్మిక సంఘం జూలై 28, సోమవారం నాడు నిర్వహించనున్న "చలో కామారెడ్డి" సభను విజయవంతం చేయాలని గాంధారి మండల అధ్యక్షులు రఘుపతి నవీన్ పిలుపునిచ్చారు. గాంధారి మండల కేంద్రంతో పాటు మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల మత్స్యకార కార్మిక సభ్యులు ఈ సభకు పెద్ద సంఖ్యలో తరలిరావాలని ఆయన కోరారు.ఈ సందర్భంగా రఘుపతి నవీన్ మత్స్యకారుల ప్రధాన డిమాండ్లను తెలియజేశారు.

## బరంగేడిగి ప్రభుత్వ పాఠశాల పరిశీలన



ప్రజా జోతి బీర్కూర్ జులై 26. బిర్కూర్ మండలం లోని బరంగేడిగి గ్రామంలో గల ప్రభుత్వ పాఠశాలను శనివారం బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి పరిశీలించారు. పాఠశాల మొత్తం తిరిగి తరగతి గదులను పరిశీలించారు. వర్షానికి నీళ్లు వస్తున్న తరగతి గదులను పరిశీలించి నీరు రాకుండా తగిన ఏర్పాట్లు చేసుకోవాలని అన్నారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడి విద్యార్థుల బాగోగులు తెలుసుకున్నారు. సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. వర్షాకాలం జాగ్రత్తలు తీసుకోవాలని ఉపాధ్యాయులకు సూచించారు. సబ్ కలెక్టర్ గారి వెంట మండల తహసీల్దార్ కే సాయి భుజంగ రావు, నాయబ్ తహసిల్దార్ జి రవి కుమార్, గిర్దవార్ బి విజయ్ కుమార్, మరియు గ్రామ పెద్దలు పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు

## యువతి అదృశ్యం

ఎల్లారెడ్డి జూలై 26(ప్రజా జ్యోతి) ఎల్లారెడ్డి మండలం భిక్కనూర్ గ్రామానికి చెందిన సాయవ్వకు ఇద్దరు కూతురు పెద్ద కూతురు వివాహం అవడంతో ప్రస్తుతం ఇంటివద్ద సాయవ్వ తన చిన్నకూతురైన సౌందర్య(20),తన భర్త అబ్రహాం ఇంటి వద్ద ఉంటున్నారు. ఈనెల తేదీ 20న ఆదివారం చర్చికి వెళ్లి వద్దామని సాయవ్వ తన చిన్న కూతురు సౌందర్య అడగగా నువ్వు వెళ్ళు నేను తర్వాత వస్తానని అన్నది. సాయవ్వ చర్చికి వెళ్లి తిరిగి మధ్యాహ్నం ఇంటికి వచ్చి చూడగా ఇంట్లో తన కూతురు సౌందర్య కనిపించలేదని వెంటనే చుట్టుపక్కల, బంధువుల వద్ద కుటుంబ సభ్యులు వెతికగా ఆమె ఆచూకీ లభించకపోవడంతో ఎల్లారెడ్డి పోలీస్ స్టేషన్ కు వచ్చి సాయవ్వ ఫిర్యాదు చేయగా సాయవ్వ ఫిర్యాదు మేరకు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.



# రేషన్ కార్డులు అందిస్తున్న ఘనత కాంగ్రెస్‌దే

**మాజీ జెడ్పిటిసి నారెడ్డి మోహన్ రెడ్డి**



రామారెడ్డి జూలై 26 (ప్రజా జ్యోతి) ప్రతి కుటుంబానికి రేషన్ కార్డులు అందిస్తున్న ఘనత రేవంత్ ప్రభుత్వానిదే అని జిల్లా పరిషత్ మాజీ ఫ్లోర్ లీడర్,మాజీ జెడ్పిటిసి నా రెడ్డి మోహన్ రెడ్డి అన్నారు.రాష్ట్రంలో అర్హులందరికీ రేషన్ కార్డులు అందిస్తూ, సన్న బియ్యాన్ని అందించిన ఘనత రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి దక్కుతుందని శనివారం పత్రిక ప్రకటనలో తెలిపారు. కేటీఆర్ ఎల్లారెడ్డిలో మతిస్థిమితం పోయి ప్రజా ప్రభుత్వం పై, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పై అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తున్నామని పేర్కొన్నారు. ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలు ఇందిరమ్మ ఇండ్లు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం,10 లక్షలు ఆరోగ్యశ్రీ, వంటి ఆరు గ్యారంటీలను అమలు పరిచి రేవంత్ రెడ్డి ప్రజల గుండెల్లో నిలిచిపోయారని,కాంగ్రెస్ పార్టీకి రేవంత్ రెడ్డికి ప్రజల తరపున కృతజ్ఞతలు తెలిపారు. సోది చెప్పే కేటీఆర్ ఎన్నికల సమయంలో మీరిచ్చిన హామీల్లో దళితులకు మూడు ఎకరాల భూమి, నిరుద్యోగ భృతి, డబల్ బెడ్ రూమ్ ఇండ్లు, రుణమాఫీ, ఇల్లు కట్టుకుంటే ఐదు లక్షలు, లాంటి అనేక పథకాలకు హామీలు ఇచ్చి ప్రజల గొంతు కోసింది మరిచిపోయారా అని పేర్కొన్నారు. చట్టసభల్లో మహిళలకు ప్రాధాన్యత ఇవ్వక అవమానపరిచింది మీరు కాదా,బీసీ వర్గానికి మీ ప్రభుత్వం గొర్రెలు బర్రెలు పంపిణీ చేస్తే, కాంగ్రెస్ ప్రభుత్వం 42 శాతం రిజర్వేషన్ కల్పించేందుకు ప్రయత్నాలు కొనసాగిస్తుందని, బీసీలకు అధికారాన్ని ఇచ్చే ఆలోచనలు కాంగ్రెస్ ఉంటే, గొర్రెలు బర్రెలు ఇచ్చి అధికారాన్ని మాత్రం దొరలు దక్కించుకున్నారు. అధికారం పోయి, మతిభ్రమించి మాట్లాడితే ఊరుకునేది లేదని హెచ్చరించారు.




## మాజీ ఎంపీపీ మృతి పార్టీకి తీరని లోటు

**మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్**

కామారెడ్డి ప్రతినిధి జూలై 26. (ప్రజాజ్యోతి) కామారెడ్డి మండల పరిషత్ మాజీ అధ్యక్షుడు బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు పిప్పిరి ఆంజనేయులు పార్థివ దేహానీ కి మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ జిల్లా పార్టీ అధ్యక్షుడు నివాళులు అర్పించారు. అనారోగ్యంతో శుక్రవారం ఆయన మృతి చెందిన విషయం తెలిసిందే. శనివారం ఆయన ఇంటికి వెల్లి పార్థివ దేహంపై పూలమాలవేసి అంజలి ఘటించారు. ఆంజనేయులు మరణం బిఆర్ఎస్ కు తీరని లోటని అన్నారు. ప్రతి ఒక్కరిని ఆప్యాయతో పలకరించే ఆయన మరణం బిఆర్ఎస్ పార్టీలో క్యాడర్ జీర్ణించుకోలేక పోతుందని అన్నారు. ఆయనతో పాటు పార్టీ నాయకులు కార్యకర్తలు నివాళులు అర్పించారు.

## అనీమియా బాధితుడికి బి పాజిటివ్ రక్తం అందజేత



**ఐవిఎఫ్ సేవాదళ్ రాష్ట్ర చైర్మన్,రెడ్ క్రాస్ జిల్లా సమన్వయకర్త డాక్టర్ బాలు.**

కామారెడ్డి టౌన్ జూలై 26. (ప్రజాజ్యోతి) కామారెడ్డి జిల్లా కేంద్రంలోని ప్రైవేట్ ఆసుపత్రిలో రాములు (58) అనీమియా వ్యాధితో బాధపడుతుండడంతో వారి కుటుంబ సభ్యులు కామారెడ్డి రక్తదాతల సమూహ అధ్యక్షులు జమీల్ హైమద్ ను సంప్రదించడంతో వారికి కావలసిన రక్తాన్ని సలీమ్ మానవతా దృక్పథంతో ముందుకు వచ్చి రక్తదానం చేసి ఆదర్శంగా నిలవడం జరిగిందని,రక్తదాతకు అభినందనలను ఐవిఎఫ్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ ఉప్పల శ్రీనివాస్ గుప్త,ఐవిఎఫ్ సేవాదళ్ రాష్ట్ర చైర్మన్,రెడ్ క్రాస్ జిల్లా సమన్వయకర్త డాక్టర్ బాలు తెలియజేశారు.

ఈ సందర్భంగా డాక్టర్ బాలు మాట్లాడుతూ ప్రస్తుతం జిల్లాలో డెంగ్యూ వ్యాధితో బాధపడుతున్న వారి సంఖ్య పెరిగిందని,తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అత్యవసర పరిస్థితుల్లో ఉన్నవారికి ప్లేట్ లెట్స్ అందజేయడానికి నిరంతరంగా ప్రయత్నిస్తున్నామని అన్నారు.

## సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



సదాశివనగర్ జూలై 26 (ప్రజాజ్యోతి) అత్యవసర సమయంలో ఆపద్బాంధవు సిఎంఆర్ఎఫ్ అని అడ్లూర్ ఎల్లారెడ్డి కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శంకర్ అన్నారు. సదాశివనగర్ మండలం అడ్లూరు ఎల్లారెడ్డిలో శనివారం ఏడుగురు లబ్ధిదారులకు రూ. రెండు లక్షల 41 వేల రూపాయల సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా పేద ప్రజలు నిరంతరం లబ్ది పొందుతున్నారన్నారు. ప్రజా ప్రభుత్వం ప్రజల కోసం నిరంతరం పనిచేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు షకీల్, నితిన్ గౌడ్, ధర్మాజీ రాజయ్య,శ్రీకాంత్ రెడ్డి, శ్రీమాన్ స్వామి, భూపాల్ గారి శ్రీనివాస్,వేణు, డప్పు బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

## డబుల్ బెడ్ రూమ్ నిర్వాసితులకు తహసీల్దార్ సూచనలు

భిక్కనూరు జూలై 24( ప్రజా జ్యోతి) భిక్కనూరు మండలంలోని రామేశ్వర పల్లి గ్రామంలో డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను ఇప్పటివరకు అధికారికంగా కేటాయించడం జరగలేదు. గత సంవత్సరం వర్షాకాలంలో జరిగిన ఇబ్బందుల దృష్ట్యా ఇళ్లల్లోకి వరద నీరు చేరి ఎటువంటి ఇబ్బందులు, ప్రాణహాని జరగకముందే, ఇళ్లను ఖాళీ చేసి సురక్షితమైన ప్రదేశాలకు వెళ్లవలసిందిగా తహసిల్దార్ సునీత మరియు సిబ్బంది సూచించారు.



# ప్రమాదకరంగా గంగమ్మ వాగు

**వాగు వంతెన నిర్మాణం వద్ద నీటి ప్రవాహం**

**ప్రయాణికులకు దారి మళ్లింపు**



రామారెడ్డి జూలై 26 (ప్రజా జ్యోతి) రామారెడ్డి మండల కేంద్రంలోని గంగమ్మ వాగు బ్రిడ్జి పనులు పూర్తి కానందున భారీ వర్షాలకు వాగు ప్రవాహం వలన వరద వృద్ధికి తాత్కాలిక మరమ్మత్తులు చేసిన రహదారి చెడిపోవడంతో ప్రయాణికులకు ప్రమాదం పొంచి ఉన్నందున ప్రజా శ్రేయస్సు కోరి తాత్కాలికంగా దారి మళ్లించారు.రామారెడ్డి మరియు గర్గుల్ గ్రామాలను కలిపే ప్రధాన రహదారిలో గంగమ్మ వాగు పై వంతెన నిర్మాణం కొనసాగుతోంది. ఈ వంతెన పూర్తికాకపోవడంతో వాహనాలు తాత్కాలిక డైవర్షన్ రోడ్డుపై ప్రయాణిస్తున్నాయి. అయితే కురుస్తున్న వర్షాల వల్ల వాగులో నీటి ప్రవాహం తీవ్రమవడంతో ఈ మార్గం కూడా ప్రమాదకరంగా మారింది. నీటి ఉధృతి పెరగడం వల్ల ప్రజల భద్రతను దృష్టిలో పెట్టుకుని అధికారులు డైవర్షన్ రోడ్డుపై ట్రాఫిక్‌ను పూర్తిగా నిలిపివేశారు. ప్రజలు అనవసరంగా ఈ మార్గంలో ప్రయాణించవద్దని, అత్యవసర ప్రయాణాల కోసం మాత్రమే వేరే మార్గాలను వినియోగించుకోవాలని సూచిస్తున్నారు.ప్రస్తుతం పరిస్థితిని సమీక్షిస్తున్న అధికారులు, వంతెన నిర్మాణాన్ని అత్యంత వేగంగా పూర్తి చేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. సంబంధిత శాఖ అధికారులు ఇప్పటికే పనులు వేగవంతం చేయాలని చర్యలు చేపట్టారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో, వంతెన నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం,అని ఆర్అండ్‌బీ శాఖ అధికారులు తెలిపారు.

## విద్యుత్ షాక్‌తో గేదె మృతి



ఎల్లారెడ్డి జూలై-26(ప్రజా జ్యోతి) ఎల్లారెడ్డి మున్సిపాలిటీ పరిధిలోని గాంధీమాసానిపేట్ కు చెందిన కుమ్మరి సంగమేశ్వర్ గేదె విద్యుత్ షాక్ తో శనివారం మృతి చెందింది. గ్రామ శివారులోని రోడ్డు పక్కన వద్ద మేత మేస్తుండడంతో ప్రమాదవశాస్తు ట్రాన్స్ ఫార్మర్ ఎర్త్ వైర్ ను తగలడంతో అక్కడికక్కడే మరణించింది. గేదె విలువ సుమారు రూ. 50,000 వరకు ఉంటుందని ప్రభుత్వం తమను ఆదుకోవాలని బాధితులు కోరుతున్నారు.

## దాబాలపై పోలీసుల దాడులు



ఎల్లారెడ్డి జూలై- 26(ప్రజా జ్యోతి) జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు లక్ష్మాపూర్‌లోని శ్రీమాతా ధాబా హెూటల్, ఎల్లారెడ్డిలోని అన్నపూర్ణ ఫ్యామిలీ దాబాలపై శనివారం రాత్రి ఎల్లారెడ్డి పోలీస్ బృందం ప్రత్యేక రైడ్ నిర్వహించడం జరిగిందని ఎస్సై మహేష్ అన్నారు. దాడుల సమయంలో ఆ ధాబాల్లో అక్రమంగా మద్యం సేవించేందుకు అనుమతిస్తున్నట్టు నిర్ధారణ కావడంతో, ఇద్దరు ధాబా యజమానులను అదుపులోకి తీసుకున్నారు.వారిపై కేసులు నమోదు చేశామన్నరు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది ఉన్నారు.

# రేబిస్ వ్యాక్సిన్ అందుబాటులో ఉంచాలి

**ప్రభుత్వ ఆసుపత్రిని తనిఖీ చేసిన ఆర్డీఓ పార్థ సింహారెడ్డి**



ఎల్లారెడ్డి, జులై 26,(ప్రజా జ్యోతి) ఎల్లారెడ్డి పట్టణంలోని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిని, శనివారం ఆర్డీఓ పార్థ సింహారెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. పట్టణంలో కుక్క దాడిలో గాయాలైన బాధితులకు రాబీస్ వాక్సిన్ అందుబాటులో లేవని ఆర్డీఓ కు స్థానికులు ఫిర్యాదు చేయడంతో, ఆసుపత్రిని సందర్శించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగుల వద్దకు వెళ్లి పరిశీలించి అందిస్తున్న వైద్యం గురించి తెలుసుకున్నారు. ఆసుపత్రికి వచ్చే రోగుల కు సంబంధించిన రిజిస్టరు ను , వైద్య సిబ్బంది హాజరు రిజిస్టరు తనిఖీ చేశారు. ఎంత మంది వైద్యులు డ్యూటీలో ఉన్నారు, సెలవులో ఎంతమంది ఉన్నారు అనే వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలో ఉన్న మందుల స్టాక్ రిజిస్టరు పరిశీలించారు. కుక్క కాటుకు సంబంధించిన రేబిస్ వ్యాక్సిన్ అందుబాటులో లేక పోవడంతో వైద్య శాఖ ఉన్నతాధికారులతో మాట్లాడి రేబిస్ వ్యాక్సిన్ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవడం జరుగుతోందని ఆర్డీఓ తెలిపారు. రోగులకు కావలసిన అత్యవసర మందులు అందుబాటులో ఉండేలా చూడాలని వైద్య సిబ్బందికి సూచించారు. రోగులకు మెరుగైన వైద్యం అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ పార్థ సింహారెడ్డి తో పాటు గిర్దావర్ శ్రీనివాస్, డ్యూటీ వైద్యురాలు డాక్టర్ సింధుజ, హెడ్ నర్సులు విజ్జి లత , రేణుక, సిబ్బంది తదితరులు ఉన్నారు.

## స్టాండఫోర్డ్ పాఠశాలలో కార్గిల్ విజయ్ దివస్




నాగిరెడ్డిపేట్,జులై26(ప్రజాజ్యోతి): నాగిరెడ్డిపేట్ మండలకేంద్రంలోని స్టాండఫోర్డ్ ప్రైవేట్ పాఠశాలలో శనివారం కార్గిల్ విజయ్ దినోత్సవం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మే,1999 న పాకిస్తాన్ చొరబాటుదారులు దొంగ చాటున నియంత్రణ రేఖను దాటి భారత భూభాగాన్ని ఆక్రమించారని అలాగే శ్రీనగర్,లేహ్ ను కలిపే కీలకమైన జాతీయ రహదారి 1-ఏ ను విడదీయడం వారి దుష్ట లక్ష్యంగాచేసుకొని భారత సైన్యంపై దాడి జరిపారని పేర్కొన్నారు. అందుకు తగ్గట్టుగానే భారత సైన్యం కళ్ళలో జాతీయ జెండాను,గుండెల్లో దేశభక్తిని కలిగి శత్రుతూటాలకు ఎదురొడ్డి తరిమికొట్టి కార్గిల్ యుద్ధంలో గెలిచిన రోజు గుర్తుగా కార్గిల్ విజయ్ దివస్ గా జరుపుకుంటారని తెలిపారు. అనంతరం కార్గిల్ యుద్ధంలో అమరులైన వీరుల చిత్రపటాలకు పూలమాలవేసి నివాళులు అర్పించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ సుశీల్,ప్రిన్సిపాల్ నాగిరెడ్డి,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# అర్హులైన వారందరికీ రేషన్ కార్డులు



**. రేషన్ కార్డులు నిరంతర ప్రక్రియ.**

**. బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి.**

రెంజల్, జులై 26(ప్రజాజ్యోతి): రెంజల్ మండలం సాటాపూర్ గ్రామంలో శనివారం సామియా గార్డెన్ లో అర్హులైన 505 లబ్ధిదారులకు

రేషన్ కార్డులు మాజీ మంత్రి బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలలో భాగంగా నేటి రోజున 505 రేషన్ కార్డులను అర్హులైన లబ్ధిదారులకు అందజేశామని తెలిపారు. రేషన్ కార్డులు నిరంతర ప్రక్రియ దరఖాస్తు చేసుకున్న ప్రతి అర్హులైన లబ్ధిదారులకు పంపిణీ చేయడానికి అధికారులు కృషి చేస్తున్నారని గుర్తు చేశారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రంలో 10 సంవత్సరాలు అధికారంలో ఉండి కూడా ఒక్క రేషన్ కార్డును కూడా ఇచ్చిన దాఖాలాలు లేవని ఎద్దేవా చేశారు . రానున్న రోజులలో రాష్ట్ర ప్రభుత్వం మరిన్ని సంక్షేమ పథకాలను ప్రజల కోసం అందుబాటులోకి తేవడం జరుగుతుందని తెలిపారు. వ్యవసాయదారులు పామ్ ఆయిల్ పంట వేసి రైతులు సహకరిస్తే పామాయిల్ ఫ్యాక్టరీని ఏర్పాటు చేసి ఎంతో మంది నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ అంకిత్ సబర్వాల్, రాష్ట్ర ఉర్దూ అకాడమీ అధ్యక్షులు తాహెర్ బీన్ హందాన్, జిల్లా గ్రంథాలయ చైర్మన్ అంతిరెడ్డి రాజారెడ్డి, మండల ప్రత్యేక అధికారి డి ఎల్ పి ఓ నాగరాజు, మాజీ ఎంపీపీ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మోబిన్ ఖాన్,సీనియర్ నాయకులు మాజీ సర్పంచ్ జావిదోద్దిన్, నితిన్, బోధన్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కార్తిక్ యాదవ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సురేందర్ గౌడ్, సాయిబాబా గౌడ్, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు గైని కిరణ్, మండల మహిళా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు ఇందిరా రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ కుర్మ శ్రీను, ఎంపీడీవో వారణాసి కమలాకర్, తహసిల్దార్ మమత, రెవెన్యూ ఇన్స్పెక్టర్ రాజు, ఆసాని అనిల్, బోగిడి రవి, అబ్బోల శ్రీకాంత్, రెంజల్ గ్రామ కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు గైన సాయిలు, గైని శివ కుమార్, నర్సయ్య, శ్రీకాంత్, అబ్బు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం విస్తీర్ణ అధికారి కరిపి రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత క్యాన్సర్ పరీక్ష శిబిరం

కామారెడ్డి ప్రతినిధి జూలై 26. (ప్రజాజ్యోతి) కామారెడ్డి జిల్లా కేంద్రంలోని కళాభారతి ఆడిటోరియం కామారెడ్డిలో రోటరీ క్లబ్, కిమ్స్, ఐఎంఏ వారి సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత క్యాన్సర్ వైద్య శిబిరం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ విచ్చేసి ఈ ఉచిత క్యాన్సర్ శిబిరం ద్వారా నిర్వహిస్తున్న వైద్య సేవలను పరిశీలించి జిల్లాలో ఇలాంటి క్యాన్సర్ నిర్ధారణ శిబిరాన్ని ఏర్పాటు చేసినందుకు రోటరీ క్లబ్,ఐఎంఏ,కిమ్స్ హాస్పటల్ వారిని అభినందించారు. పేద ప్రజల అధికంగా ఉన్న ఈ జిల్లాలో ఇలాంటి శిబిరాల వల్ల ప్రజల ఆరోగ్యానికి మంచి మేలు జరిగే అవకాశం ఉందని ఇలాంటి శిబిరాలు మరిన్ని నిర్వహించేందుకు కృషి జరగాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిడబ్ల్యూఓ ప్రమీల, కిమ్స్ హాస్పిటల్ డాక్టర్ మధు, రోటరీ క్లబ్ అసిస్టెంట్ గవర్నర్ ఆర్కె గ్రూప్ ఆఫ్ కాలేజెస్ సీఈఓ డాక్టర్ యం జైపాల్ రెడ్డి, ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ గీరెడ్డి రవీందర్ రెడ్డి, ఎల్లారెడ్డి సిడిపిఓ రాణి హాజరై జ్యోతి ప్రజ్వల చేశారు. రోటరీ క్లబ్ అసిస్టెంట్ గవర్నర్ డాక్టర్ ఎం జైపాల్ రెడ్డి మాట్లాడుతూ కామారెడ్డి జిల్లా లో కిమ్స్ హాస్పిటల్ వారు ఉచిత క్యాన్సర్ శిబిరం ఏర్పాటు చేయడం గొప్ప విషయం అన్నారు. దాదాపు 300 మంది ఈ క్యాన్సర్ పరీక్ష చేసుకోవడం జరిగిందని తెలియజేశారు. జిల్లాలో మొదటి సారి ఈలాంటి శిబిరం నిర్వహించడం వలన చాలా మంది నిరుపేదలకు ఉపయోగపడిందని చెప్పినారు. కిమ్స్ డాక్టర్ మధు మాట్లాడుతూ కామారెడ్డి ఐయంఏ, రోటరీ క్లబ్ వారి సహకారం తో ఉచిత క్యాన్సర్ శిబిరం ఏర్పాటు చేయడం జరిగిందని ఈ ఉచిత వైద్య శిబిరానికి వచ్చిన ప్రజలకు అభినందనలు తెలిపారు. క్యాన్సర్ వ్యాధి భయానిక వ్యాధి కాదని, ప్రజలు క్యాన్సర్ పరీక్షలు చేసుకోవడం వల్ల ముందస్తుగా క్యాన్సర్ మహమ్మారిని అరికటవచ్చు అన్నారు. ఈ కార్యక్రమంలో రోటరీ అధ్యక్షులు శంకర్,సెక్రటరీ సబ్బాని కృష్ణ హరి, ట్రెజరర్ వెంకట రమణ,రోటరీ సభ్యులు రాజనర్సింహ రెడ్డి , డా బాలరాజు, సుధాకర్ ,నాగభూషణం నవీన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



## బంజారా నాయకులకు సన్మానం

గాంధారి, జూలై 27 (ప్రజాజ్యోతి) గాంధారి మండల కేంద్రంలో శనివారం తెలంగాణ రాష్ట్ర లాభన్ సమాజ్ అధ్యక్షులు బస్సి తాన్ సింగ్ నాయక్ ఆధ్వర్యంలో కామారెడ్డి బంజార లంబాడి హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షులు ప్రేమ్ సింగ్, గాంధారి మండలం లంబాడి హక్కుల పోరాట సమితి అధ్యక్షులు బాధవత్ పరశురాం, మాజీ సర్పంచ్ ప్రేమ్, దేవి సింగ్ లను సన్మానించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర లాభన్ అధ్యక్షులు బస్సి తాన్ సింగ్ నాయక్, మాజీ ఎంపీపీ దశరత్ నాయక్, మాజీ సర్పంచ్ దర్బార్, మాజీ ఉప సర్పంచ్ బస్సి నర్సింగ్, కిరణం దర్బార్, రబ్బ్య రవీందర్ మరియు తదితరులు పాల్గొన్నారు.






## కమ్మర్పల్లి మండల కేంద్రంలో ఆర్మీ జవాన్ లకు సన్మానం

కమ్మర్ పల్లి, జులై 26. ప్రజా జ్యోతి. కమ్మర్పల్లి మండల కేంద్రంలో శనివారం రఘు టిఫిన్ సెంటర్ ఆధ్వర్యంలో కార్గిల్ విజయం సాధించి 26. సంవత్సరాలు పూర్తిచేసిన సందర్భంగా కమ్మర్పల్లి గ్రామానికి చెందిన ఆర్మీ జవానులకు ముగ్గురు ఆర్మీ జవాన్లు చింతకుంట, నవీన్, పోల్కం తరుణ్, సర్జన్ సింగ్, ఈ ముగ్గురు జవానులకు శాలువలతో ఘనంగా సన్మానం చేశారు.తెలంగాణ ఉద్యమకారుడు నల్ల గణేష్ గుప్తా మాట్లాడుతూ దేశ రక్షణలో ప్రాణాలను ప్రాణంగా పెట్టి దేశానికి సేవలందిస్తున్న జవానులను గౌరవించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని ఈ సందర్భంగా ఆర్మీ జవాన్లకు శాలువాలు కప్పి వారిని సన్మానించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రఘు,భోగ రామస్వామి, జొన్నల సుభాష్,నరేందర్,ధోని, సాగర్,దరి, రవి, నాగరాజు, శంకర్, మహేందర్, సుభాష్ గౌడ్, గజ్జల శ్రీనివాస్, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# కుక్క దాడిలో ఎనిమిది మందికి గాయాలు

ఎల్లారెడ్డి జూలై -26(ప్రజా జ్యోతి) ఎల్లారెడ్డి పట్టణంలో శనివారం కుక్క దాడి చేయడంతో ఎనిమిది మందికి గాయలయ్యాయి. పట్టణానికి చెందిన సంగయ్య, రాములు, మైసకాల తో పాటు మరో ఐదుగురికి కుక్క దాడి చేసినట్లు స్థానికులు తెలిపారు. ఓ పిచ్చికుక్క అక్కడ నిలబడిన గుంపులోకి ఒక్కసారిగా చొరబడి పలువురిని కరవడంతో భయభ్రాంతులకు గురయ్యారు. కుక్క దాడిలో గాయపడ్డ 8 మందిని వెంటనే స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించి చికిత్స చేయించారు. ఆసుపత్రిలో సిబ్బంది, సరిపడా మందులు లేకపోవడంతో గాయపడ్డ వారిని బాన్సువాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలిచ్చినట్లు స్థానికులు తెలిపారు. ఆసుపత్రిలో కనీసం ఒక్క వ్యాక్సిన్ లేకపోవడంతో ఆసుపత్రిపై కుటుంబ సభ్యులు మండిపడ్డారు. పట్టణంలో కుక్కల బెడద తీవ్రంగా ఉందని, నియంత్రించాలని స్థానికులు చెబుతున్నారు.





## జానకంపేట్ గ్రామంలో దొంగతనం

ఎడపల్లి జూలై 26 (ప్రజాజ్యోతి).నిజామాబాద్ జిల్లా ఎడపల్లి మండలం జానకంపేట్ గ్రామంలో శనివారం తెల్లవారుజామున గ్రామానికి చెందిన మిద్దె గోదావరి అనే మహిళ ఇంట్లో గుర్తు తెలియని దొంగలు చేతివాటం ప్రదర్శించి దొంగతనం చేశారు. మహిళ ఇంట్లో చోరబడి 8 గ్రాముల బంగారంతో పాటు 10 తులాల వెండి పట్టీలను చోరీ చేశారని సదరు మహిళ ఎడపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. గుర్తుతెలియని వ్యక్తులు చొరబడి బీరువా పగలగొట్టి అందులో దాచి ఉంచిన బంగారం వెండి అభరణాలను అపహరించుకొని పారిపోయారు.ఆమెకు అనుమానం రావడంతో నిర్ధారించుకొని పైన పేర్కొన్న వస్తువులు లేకపోవడంతో ఆమె ఆవేదన గురై పోలీసులకు సమాచారం అందించింది. ఈ ఘటనపై ఎడపల్లి పోలీసులు వివరాలు సేకరించారు.



